

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు పొతంగల్ విద్యార్థినులు


ప్రణీత


సంజన

గాంధారి, ఫిబ్రవరి 9: మండలంలోని పొతంగల్ గ్రామానికి చెందిన ప్రణీత, సంజనలు మహారాష్ట్రలోని దమంగల్ పట్టణంలో జరిగే జాతీయస్థాయి సీనియర్స్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రాథోడ్ తెలిపారు. వరంగల్ జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 10,11 తేదీల్లో నిర్వహించే పోటీల్లో వీరు పాల్గొననున్నారని తెలిపారు.



ప్రజా సమస్యలు చర్చించేనా?

- జిల్లాలో నెలకొన్న అనేక సమస్యలు
- ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కరువు
- పెండింగ్‌లోనే రైతుల పంట నష్ట పరిహారం
- పరిష్కారానికి నోచుకోని అటవీ, రెవెన్యూ భూములు
- జడ్పీకి అరకొర నిధులపై సభ్యుల అసంతృప్తి
- ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలపై లేవనెత్తనున్న సభ్యులు
- పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులు హాజరయ్యేనా?
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కామారెడ్డి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం జరగనున్న జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు చర్చించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతీసారి నిర్వహించిన జడ్పీ సమావేశాల్లో సుదీర్ఘంగా ప్రజా సమస్యలపై చర్చ సాగడం లేదనే వాదన ప్రజల నుంచే కాకుండా పాలకవర్గ సభ్యుల నుంచి వినిపిస్తోంది. జిల్లా ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై గతంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో గంటల కొద్ది చర్చించేవారు. అర్ధరాత్రి వరకు సమావేశాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. అవసరమైతే రెండు రోజులు కూడా సమావేశాలు నిర్వహించే వారు. ఇప్పుడు అంతా మొక్కుబడి వ్యవహారంగా మారింది. జడ్పీ పాలకవర్గం కొలువుదీరినప్పటి నుంచి ఇప్పటి వరకు 9 సమావేశాలు జరిగాయి. 1, 2 సమావేశాల్లో కొంతమేర చర్చ జరిగినా మిగితావి మొక్కుబడిగా ముగిశాయి. చాలా అంశాలను అటకెక్కించడంతో ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఇదిలా ఉండగా ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడడం గత జడ్పీ సమావేశానికి సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెడతారనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సారైనా పాలకవర్గ సభ్యులు పూర్తిస్థాయిలో హాజరై సమగ్ర చర్చ జరిగి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరు గ్యారెంటీ స్కీంలపై చర్చించేందుకు సిద్ధం

రాష్ట్రంలో కాంగ్రెస్ కొత్త ప్రభుత్వం ఏర్పడి 60 రోజులు కావస్తోంది. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల స్కీంలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాల అమలుకు అడుగులు వేస్తోంది. ఈ సంక్షేమ పథకాలలోని రెండింటిని ఇప్పటికే ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ఇక గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం ఆయా శాఖలతో సర్వే చేపడుతోంది. అదేవిధంగా ప్రజాపాలన సదస్సులను నిర్వహించి ఆరు గ్యారెంటీలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వీటిపై జడ్పీపాలకవర్గ సభ్యులు నేడు సర్వసభ్య సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రస్తుతం సర్వేచేస్తున్న గృహజ్యోతి, ఎల్పీజీ పథకాల పురోగతిపై అధికారులను వివరాలు సభ్యులు అడిగే అవకాశాలు ఉన్నాయి. అర్హులైన వారందరికీ పథకాలను అందించే విధంగా పారదర్శక సర్వే చేపట్టాలని సభ్యులు సూచించనున్నారు.

రైతులకు పంట నష్టపరిహారంపై లేవనెత్తేనా?

జిల్లాలో గత మూడేళ్ల నుంచి వడగండ్ల వర్షాలకు రైతుల పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే రైతులకు నష్టపరిహారంపై ప్రభుత్వాలు హామీలకే పరిమితం అవుతున్నాయి. గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి రైతులకు పంట నష్టపరిహారం అందడం లేదు. ప్రతీ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు రైతుల పంట నష్ట పరిహారంపై లేవనెత్తడం, తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపుతున్నారే తప్ప రైతులకు మాత్రం న్యాయం జరగడం లేదు. అయితే ఇప్పటి వరకు పరిహారం ఇవ్వకపోవడంపై రైతులు తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో అనేక మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లింగంపేట, నాగిరెడ్డిపేట, సదాశివనగర్, గాంధారి, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన పాలకవర్గ సభ్యులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో నెలకొంటున్న సమస్యలపై సభ దృష్టికి తీసుకువస్తున్నప్పటికీ పరిష్కారానికి మాత్రం అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అదే విధంగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని రోగులకు వైద్యచికిత్సలు అందించడం లేదు, సౌకర్యాలు లేవు. వీటిపై పాలకవర్గ సభ్యులు సభలో ప్రస్తావించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సవ విగ్రహాలుగా జడ్పీటీసీలు, ఎంపీపీలు

స్థానిక సంస్థల్లో ప్రధానమైన జిల్లా, మండల పరిషత్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో అవి నిర్వీర్యం అవుతున్నాయి. సీనరేజ్ ద్వారా వచ్చే నిధులపైనే ఆధారపడగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు ఏ మాత్రం చాలక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది. ఎన్నికల సందర్భంగా గ్రామాల అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీలు ముఖం చాటేస్తున్నారు. గత ప్రభుత్వం జిల్లా, మండల పరిషత్‌లకు సరిపడా నిధులు విడుదల చేయలేకపోయిందని పాలకవర్గసభ్యులు అసంతృప్తితో ఉన్నారు. 14వ ఆర్థిక సంఘం ద్వారా మండల, జిల్లా పరిషత్‌లకు 30 శాతంకు పైగా నిధులు రాగా వాటితోనే అభివృద్ధి పనులు చేపట్టారు. అంతకుముందు బీఆర్‌జీఎఫ్ పథకం ద్వారా కేంద్రం ఇచ్చే నిధులతో కొంత అభివృద్ధి జరిగిది. 15వ ఆర్థిక సంఘం నిధులను వంద శాతం గ్రామ పంచాయతీలకే కేటాయించింది. దీంతో జిల్లా పరిషత్ సభ్యులైన జడ్పీటీసీ, ఎంపీటీసీలు నిధుల వ్యవహారంలో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గ్రామ పంచాయతీలు, ఎమ్మెల్యే, ఎంపీల నిధులపైనే ఆధారపడాల్సి వస్తుందని తమ సొంతగా నిధులు లేక గ్రామాల్లో పనులు చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వమైన జడ్పీటీసీలకు, ఎంపీపీలకు పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపుపై సభ్యులు లేవనెత్తే అవకాశం ఉంది.

ప్రజా ప్రతినిధులు హాజరయ్యేనా?

గత మూడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు పాలకవర్గ సభ్యులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు హాజరుకాకపోవడంతో సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా కొనసాగుతూ వచ్చాయి. మూడు నెలల కిందట జరిగిన జడ్పీ సమావేశానికి ఏకంగా పాలకవర్గ సభ్యులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. కేవలం 12 మంది మాత్రమే జడ్పీటీసీ, ఎంపీపీలు హాజరు కావడంతో సమావేశాన్ని మమ అనిపించేశారు. ఇక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు గత మూడు సమావేశాలకు డుమ్మా కొడుతూ వచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు జడ్పీ సమావేశానికి హాజరుకాకపోవడం మరి కొందరు జడ్పీటీసీలు, ఎంపీపీలు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో జడ్పీ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించేవారే కరువవుతున్నారు. ఈ సమావేశానికైన ఎమ్మెల్యేలు, పాలకవర్గ సభ్యులు పూర్తిస్థాయిలో హాజరై ప్రజా సమస్యలు చర్చించాలని కోరుతున్నారు.



ఈ నెలాఖరులోగా సీఎంఆర్‌ను అందించాలి



లింగంపేట నాగన్న బావిలో పూడిక తీస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 9: గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 28,146 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని భారత ఆహార సంస్థకు అందించేందుకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించిందని, ఈ సదవకాశాన్ని మిల్లర్లు ఉపయోగించుకుని వంద శాతం లక్ష్యం సాధించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి సీఎంఆర్ పెండింగ్ ఉన్న 26 రైస్‌మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు 91 శాతం సీఎంఆర్ లక్ష్యాన్ని సాధించామని, మరో 9 శాతాన్ని ఈ నెలాఖరు లోగా అధిగమించడానికి రైస్‌మిల్లర్లు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈనెల 15న పురోగతిని తిరిగి సమీక్షిస్తానని లక్ష్యం దిశగా సాగని మిల్లులపై క్రిమినల్ కేసులు పెట్టి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు, సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్‌లు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

ఏదైన సాధించి చూయించేది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే..

ఏదైన సాధించి చూయించేది ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులేనని వారిని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల పీఆర్‌టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఏ రంగంలో రాణించాలన్న చదువు అవసరమని, నేడు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కార్యదర్శి కుషాల్ పాల్గొన్నారు.

ప్రాచీన కట్టడాలను పరిరక్షించుకోవాలి

లింగంపేట: మన సంస్కృతి సంప్రదాయాలకు ఎంతో విశిష్టత ఉందని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రాచీన కట్టడం నాగన్న బావిలో పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా ఐకేపీ మహిళా సంఘాలు, ఈజీఎస్ సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. మన పూర్వికులు ప్రాచీన కాలంలోనే ముందుచూపుతో వందల సంవత్సరాలు చెక్కు చెదరని విధంగా నిర్మాణాలు గావించారని అట్టి నిర్మాణాలను, బావులను పరిరక్షించుకోవాలని ఆయన తెలిపారు. ఇటీవల భిక్కనూర్ మండలంలోని సిద్ధరామేశ్వర ఆలయ ప్రాంగణంలోని కోనేరును దాతల సహకారంతో పునరుద్ధరించామని ఆయన అన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో ఈనెల 14 వరకు పారిశుధ్య పనులను చేట్టాలని పంచాయతీ ప్రత్యేక అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో మల్లిఖార్జున్, ఎంపీపీ గరీబున్నీసా, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో అన్నపూర్ణ, కార్యదర్శి శ్రావణ్, మహిళా సంఘాలు, యువకులు పాల్గొన్నారు.

అన్ని పరీక్షలు ఒకే చోట

భిక్కనూరు, ఫిబ్రవరి 9: ప్రస్తుత రోజుల్లో ప్రైవేటు ఆసుపత్రికి ఏ కారణం చేతనైనా వెళితే తప్పకుండా సదరు డాక్టర్ కొన్ని రకాల పరీక్షలు రాసి చేయించడం సర్వసాధారణం. ఈ పరీక్షలకు కనీసం రూ.500ల నుంచి రూ.2000 వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. శస్త్రచికిత్స, తదితర వాటికైతే దాదాపుగా రూ.3వేలకు పైగానే ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ధనికులైతే ఎలాగో ఖర్చు చేస్తారు, కానీ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మాత్రం తలకు మించిన భారమే. ఈ టెస్టులకు సంబంధించి సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ భారాన్ని తగ్గించాలన్న ఉద్దేశ్యంగా గత ప్రభుత్వంలో జిల్లా కేంద్రానికి ఒక టీ హబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ టీ హబ్‌కు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో రోగుల వద్ద సేకరించిన శాంపిళ్లను పంపిస్తారు. ఇక్కడ సిబ్బంది వాటికి పూర్తి ఉచితంగా పరీక్షలు నిర్వహించి వాటి రిజల్ట్‌ను, రోగుల సెల్‌ఫోన్‌తో పాటుగా సదరు ఆసుపత్రికి పంపిస్తారు.

జిల్లా కేంద్రంలో రూ.1.25 కోట్లతో ఏర్పాటు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గత సంవత్సరం జూలై నెలలో రూ.కోటి 25 లక్షలతో వైద్య కళాశాల సమీపంలో అన్ని హంగులతో నిర్మించారు. ఇందులో పథాలజీ, మైక్రో బయోలజీ, బయో కెమిస్ట్రీ విభాగాలకు సంబంధించి ప్రత్యేక ల్యాబ్‌లు ఉండగా ప్రతీ విభాగంలో వాటికి సంబంధించిన పరీక్షలు ప్రతిరోజూ ల్యాబ్ మేనేజర్, ల్యాబ్ హెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇలా ప్రతిరోజూ 57 రకాల వాటికి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ టీహబ్‌కు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలలోగా సేకరించిన శాంపిళ్లను ఏర్పాటు చేసిన వాహనాలలో సిబ్బంది తీసుకువస్తారు.

టీ హబ్‌కు ప్రతిరోజూ 600ల నుంచి 700ల వరకు శాంపిళ్లు

జిల్లాలోని 31 ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ప్రస్తుతం టీ హబ్‌కు ప్రతిరోజూ 600ల నుంచి 700ల వరకు శాంపిళ్ల వస్తున్నాయి. ఈ 31 ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేకరించిన ఆయా రకాల శాంపిళ్లకు ఆసుపత్రిలోని ల్యాబ్ టెక్నీషియన్ పేషెంట్ పేరు, వారి ఫోన్ నెంబర్‌ను ఏర్పాటు చేస్తారు. వాటి ఆధారంగా టీ హబ్‌కు వచ్చిన శాంపిళ్లకు సంబంధించిన పరీక్షల వివరాలను టీ హబ్ సిబ్బంది 24 గంటల్లోగా పేషెంట్ ఫోన్‌కు మెసేజ్ చేస్తారు. ఒకవేళ ఫోన్‌కు మెసేజ్ రానివారు 48 గంటల అనంతరం టీహబ్‌కు వచ్చి వివరాలను చెప్పిన వారికి రిపోర్టును అందజేస్తారు. టీ హబ్‌లో మేనేజర్ స్వప్న, ల్యాబ్ హెడ్ డాక్టర్ ప్రియాంక, ఫాతిమా, ఒక డీఈవో, ఒక ఫార్మాసిస్టు, ఇద్దరు రేడియోగ్రాఫర్స్, నలుగురు ఎల్‌టీలు, ఒక హెల్పర్ ప్రతిరోజూ విధులు నిర్వహిస్తున్నారు.



కామారెడ్డిలోని టీ హబ్ భవనం

- జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో టీ హబ్
- ప్రస్తుతం అందుబాటులో 57 రకాల పరీక్షలు
- ప్రతీ ఆసుపత్రి నుంచి రోజు 15కు పైగా శాంపిళ్లు

టీ హబ్‌లో చేపడుతున్న 57 రకాల పరీక్షలు

ఈ టీహబ్‌లో ప్రస్తుతం బయోకెమిస్ట్రీ విభాగంలో 35 రకాల పరీక్షలు, పాథోలజీ విభాగంలో 14 రకాల పరీక్షలు, మైక్రో బయాలజీ విభాగంలో 8 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రతిరోజూ పీహెచ్‌సీల నుంచి 15కు పైగా శాంపిళ్లు

కామారెడ్డి వ్యాప్తంగా 31 ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి టీ హబ్‌కు ప్రతిరోజూ శాంపిళ్ల వస్తున్నాయి. ప్రతిరోజూ ఆయా ఆసుపత్రుల్లో 15 నుంచి ఆపై ఎక్కువ ఆసుపత్రికి వచ్చిన రోగుల నుంచి శాంపిళ్లను సేకరించి టీహబ్‌కు ప్రతిరోజూ సాయంత్రం 5లోపు పంపించడం జరుగుతుంది. రోజు వారీగా వస్తున్న శాంపిళ్లకు ఏ రోజుకు ఆ రోజే టీహబ్ సిబ్బంది పరీక్షలు నిర్వహించి అర్ధరాత్రి వరకు వారి సెల్ నెంబర్లకు ఫలితాన్ని పంపిస్తున్నారు. గతంలో ప్రతీ పీహెచ్‌సీ నుంచి కేవలం ఒకటి, రెండు శాంపిళ్లను మాత్రమే ల్యాబ్ టెక్నీషియన్లు పంపేవారు. దీంతో ఎప్పటికప్పుడు జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు ఆసుపత్రులను సందర్శించి సిబ్బందిలో మార్పు తీసుకువచ్చారు. ప్రస్తుతం ప్రతీ పీహెచ్‌సీ నుంచి 15 నుంచి అంతకంటే ఎక్కువ మొత్తంలో శాంపిళ్లను పంపిస్తున్నారు.

ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నాం

ఎస్. స్వప్న, టీ హబ్ మేనేజర్, కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు జిల్లావ్యాప్తంగా 31 పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల నుంచి ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలలోపు టీ హబ్‌కు ఐదు వాహనాల్లో ఆయా ఆసుపత్రుల్లో సేకరించిన నమూనాలు వస్తాయి. అందుకు తమకు ఐదు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రుల నుంచి వచ్చిన నమూనాలకు టీ హబ్‌లో ఏ రోజుకు ఆ రోజే పరీక్షలు చేపట్టడం జరుగుతుంది. ప్రస్తుతం టీ హబ్‌లో 57 రకాలకు సంబంధించి ప్రతిరోజూ దాదాపుగా 600ల నుంచి 700ల శాంపిళ్లకు పరీక్షలు చేయడం జరుగుతుంది. పరీక్షలు చేసిన వెంటనే తమ సిబ్బంది శాంపిల్‌పైన ఉండే ఫోన్ నెంబర్‌కు పరీక్షల ఫలితాన్ని ఎస్ఎంఎస్ రూపంలో పంపించడం జరుగుతుంది. టీ హబ్ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

ద్విచక్ర వాహన దొంగల అరెస్టు



పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ సింధూ శర్మ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 9: కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలో ద్వి చక్ర వాహనాలను దొంగిలిస్తున్న దుండగులను అరెస్టు చేసినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. శుక్రవారం కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 8న నిజాంసాగర్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా బండిపై వచ్చిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు ఆపి వాహన సంబంధిత పత్రాలను చూపాలని కోరారు. దీంతో పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా వారిని వెంబడించి పట్టుకుని విచారించగా నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కుబూకన్‌పల్లికి చెందిన నిజాంపూర్ శశాంక్, ఏరుగట్ల సందీప్, మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ అహ్మద్‌లుగా గుర్తించామని తెలిపారు. విచారణలో తాము 29 ద్విచక్రవాహనాలను కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాల్లో దొంగిలించినట్లు తెలిపారని అన్నారు. ఇందులో కామారెడ్డి జిల్లాకు చెందిన 17 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని అందులో కామారెడ్డి 12, బాన్సువాడ 4, నస్రూల్లాబాద్ 1 ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాకు చెందిన 10 ద్విచక్ర వాహనాల్లో నిజామాబాద్ రూరల్ 2, వేల్పూర్ 2, మోర్తాడ్ 1, ఇందల్‌వాయి 1, నిజామాబాద్ 1 టౌన్ పరిధిలో 2, ఆర్మూర్ 1, కమ్మర్‌పల్లి 1 ఉన్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన 2 ద్విచక్ర వాహనాల్లో నిర్మల్ 1, భైంసా 1 ఉన్నాయి. వీటి విలువ మొత్తం రూ.40లక్షల వరకు ఉంటుందని వీటిలో 12 బుల్లెట్ బండ్లు, 12 పల్సర్‌బండ్లు, 1 ఆక్టివా, 1 గ్లామర్, 1 హెచ్ఎఫ్ డీలక్స్, 1 స్ప్లెండర్, 1 టీవీఎస్ స్టార్ సిటీ బండ్లు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రజలు తమ వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని నెంబర్ ప్లేట్లలో ఉన్న అక్షరాలను, నంబర్లను తొలగించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసులను అతి తక్కువ సమయంలో చాకచక్యంగా వ్యవహరించి చేదించిన సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్, ఎస్ఐలు ఉస్మాన్, శ్రీరాం, సిబ్బంది రాజేశ్వర్, సురేందర్, సయిద్, కిషన్, గణపతి, శ్రవణ్, రాజేందర్, కరుణాకర్, రాజు, విశ్వనాథ్, రమేష్, నరేష్, భాస్కర్, రవి, నవీన్‌లను అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప క్షేత్రంలో ఘనంగా మండల పూజ

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని ఉప్లూర్ గ్రామంలో గల రుషికొండ అయ్యప్ప క్షేత్రంలో కొలువై ఉన్న స్వామి అయ్యప్పకు శుక్రవారం మండల పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొడగండ్ల శ్రీరామచరణ్‌శర్మ, హిందూ ధర్మం ఆస్థాన పండితుల అద్వర్యంలో మండలపూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి వేదమంత్రోచ్ఛరణల మధ్య అభిషేకం, యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి మేడారం భూమన్న, బద్దం తిరుపతిరెడ్డి గాజుల రాజ్‌వీర్, క్యాతం మల్లికార్జున్ దంపతులతో పాటు గోపిడి భూమన్న రుషికొండ అయ్యప్పక్షేత్రం, అయ్యప్పసేవాలసమితి సభ్యులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వర స్వామి ఉత్సవాలు

- భక్తులతో కిక్కిరిసిన ఆలయం


ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి9: మండలంలోని సంతాయిపేట శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాఘఅమావాస్య సందర్భంగా భీమేశ్వర స్వామి ఉత్సవాలు కన్నుల పండువగా సాగాయి. ఆలయ ఆవరణంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ప్రతీ సంవత్సరం మాఘ అమావాస్యం సందర్భంగా స్వామి స్వయంభూలింగాన్ని దర్శించుకుని భక్తులు పునీతులవుతారు. మండలంలోని భక్తులే కాకుండా ఇతర మండలాల నుంచి వచ్చిన భక్తులు పెద్దఎత్తున హాజరై దర్శనం చేసుకున్నారు. ఉత్తరం నుంచి దక్షిణం వైపునకు భీమేశ్వరవాగు ప్రవహిస్తుండడంతో ఈ వాగులో మాఘ అమావాస్య సందర్భంగా స్నానంచేస్తే పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సులను నడిపారు. ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ప్రత్యేక కంటి వైద్యశిబిరం ఏర్పాటుచేయించడంతో భక్తులు పరీక్షలు చేయించుకుని ఉచితంగా కంటి అద్దాలుఅందుకున్నారు. ఆలయానికి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. అదేవిధంగా కృష్ణాజీవాడి, చిట్యాల గ్రామాలలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయాలకు విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదం పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాపురెడ్డి, ప్రతినిధులు శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, సతీష్, కృష్ణమోహన్, రాజిరెడ్డి, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, భాస్కర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామారెడ్డి అదనపు కలెక్టర్

రేపు గురుకుల పాఠశాలల ప్రవేశపరీక్ష

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 9:తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో చేరబోయే విద్యార్థుల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. ఈ ప్రవేశపరీక్ష ఏర్పాట్లపై ఆయా పాఠశాలల ప్రిన్సిపల్‌తో కలెక్టర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 3,986 మంది విద్యార్థులు ఈ ప్రవేశపరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో ఆదివారం ఉదయం 10గంటలకు సంబంధిత పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి 1 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

పది రోజుల్లో చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలి

● ఉత్తర్వులను జారీ చేసిన హైకోర్టు

ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి 9: ఇటీవల నిర్వహించిన అవిశ్వాస పరీక్ష నెగ్గిందని పది రోజుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలని శుక్రవారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 4న అవిశ్వాస పరీక్ష నిర్వహించగా 25మంది కౌన్సిల్ సభ్యులు హాజరుకాగా 24మంది అవిశ్వాస పరీక్షకు మద్దతుగా ఓటు వేయడం జరిగింది. దీంతో అధికారులు అవిశ్వాస పరీక్ష నెగ్గిందని ప్రకటించారు. అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత హైకోర్టును ఆశ్రయించగా శుక్రవారం హైకోర్టు కేసును కొట్టివేస్తూ అవిశ్వాస పరీక్షకు హాజరైన సభ్యులలో 2/3 సభ్యులు 17మంది ఓటు వేస్తే సరిపోతుందని అవిశ్వాస పరీక్ష నెగ్గిందని పది రోజుల్లో చైర్‌పర్సన్ ఎన్నిక చేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

సిరికొండ, ఫిబ్రవరి 9: హన్మకొండ జిల్లాలో శనివారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండకు చెందిన జీ.హర్షవర్ధన్ ఎంపికైయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య తెలిపారు. అండర్-18 సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు హర్షవర్ధన్ ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు. క్రీడాపోటీల్లో హర్షవర్ధన్ మంచి ప్రదర్శన ప్రదర్శించి మండలానికి, జిల్లాకు పేరు తేవాలని ఆయన కోరారు. జిల్లా క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

డిచ్‌పల్లి: గత నెల 30న ఆర్మూర్‌లో జరిగిన నిజామాబాద్ జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలుర జట్టులో మిట్టాపల్లిపాఠశాల విద్యార్థి బుక్య దేవేందర్ పాల్గొని చక్కని ప్రతిభను కనబర్చి ఈనెల 10 నుంచి 11వరకు హన్మకొండ జిల్లా ధర్మసాగర్‌లో జరిగే 9వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుజన్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దేవేందర్‌ను వ్యాయామ ఉపాధ్యాయులు గంగమోహన్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జిల్లాస్థాయి సైన్స్ పోటీలకు ఎంపిక

ఏర్గట్ల, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ డేను పురస్కరించుకొని జిల్లా స్థాయి సైన్స్ పోటీలకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి తెలిపారు. అందులో భాగంగా పాటలు, కవిత్వం, పేయింటింగ్, స్పీచ్ పోటీలు నిర్వహించగా ఏర్గట్ల పాఠశాల నుండి స్పీచ్ పోటీలో అస్నిహా భాను. పేయింట్‌లో నిహారిక, పాటల పోటీలకు సాయి సిద్ధార్థ, కవిత్వంలో తడపాకల్ పాఠశాలకు చెందిన రింశా గెలుపొంది జిల్లా స్థాయిలో ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఆనంద్‌రావు, మండల సైన్స్ కన్వీనర్ రాజశేఖర్, ఆయా పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో మండలస్థాయి సైన్స్ పోటీలు

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 9: జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ శాస్త్ర సాంకేతిక మండలి, పర్యావరణ పరిరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో మండలస్థాయిలో విద్యార్థులకు నాలుగు విభాగాలలో పరీక్షలు నిర్వహించారు. ఉపన్యాసంలో ప్రవీణ, పాటల పోటీలలో ఐశ్వర్య, కవిత్వంలో నందనశ్రీ, చిత్రలేఖనం పోటీలో సిద్దార్థ్ గెలుపొందినట్లు పాఠశాల హెచ్‌ఎం రవీంధర్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు ప్రతీ మండలం నుంచి నలుగురు విద్యార్థులను ఎంపిక చేస్తారని వారన్నారు. ఈనెల 12వ తేదీన నిజామాబాద్‌లో జరగనున్న జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని, ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారిని ఈనెల 28వ తేదీన సైన్స్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సన్మానిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మల్లేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 9: ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ప్రతినిధులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కాంత్, రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలని, వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజ్‌కుమార్, విజయసారథి, పంచాయతీకార్యదర్శి సుకన్య, హెచ్‌ఎం ఇందిరా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో అక్రమ నిర్మాణం సీజ్

ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి 9: మున్సిపల్ పరిధిలోని మహాలక్ష్మీ కాలనీలో ఓ అక్రమ నిర్మాణాన్ని శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సీజ్ చేశారు. ఇంటి యాజమాని మూడంతస్తుల భవన అనుమతి తీసుకొని ఐదు అంతస్తులు నిర్మించారని సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం జరగడంతో మున్సిపల్ చట్టం ప్రకారం ఆ భవనాన్ని నిలిపి వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ తెలిపారు. వారి వెంట రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అశోక్‌సింగ్, సర్వేయర్ షికారి రాజు, టౌన్‌ప్లానింగ్ అధికారి హరిష్, ఎస్సై గంగాధర్, ఫైర్‌స్టేషన్ ఎస్సై మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది అశోక్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

గన్నారంలో అనుమానిత మహిళ సంచారం

● పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు అప్పగింత ● గేదెల మంద వద్ద మరో అనుమానితున్ని పట్టుకున్న స్థానిక యువకులు ● నవీపేట వారసంతాలో ముగ్గురికి దేహశుద్ధి ● ఇటుక బట్టి కార్మికులుగా గుర్తించిన పోలీసులు

ఇందల్‌వాయి, ఫిబ్రవరి 9: మండలంలోని గన్నారం గ్రామంలో అనుమానస్పదంగా సంచరిస్తున్న మహిళను శుక్రవారం స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనుమానంగా సంచరిస్తున్న ఆమెను మహిళలు ప్రశ్నించడంతో పొంతన లేకుండా సమాధానాలు చెప్పడంతో చితకబాధి పోలీసులకు అప్పగించారు. ఇటీవల జిల్లాలో పలుచోట్ల వరుసగా చిన్నపిల్లలను ఎత్తుకెళ్తున్న ఘటనలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మహిళలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.మహిళను పోలీసులు విచారించగా ఆమె సిరికొండ మండలానికి చెందిన కండ్లకోయ పోచవ్వగా గుర్తించామని పోలీసులు తెలిపారు. ఆమె అక్క లక్ష్మి కూతురికి అమ్మోరు సోకడంతో కొందరు తెలిసిన వ్యక్తులు వారి కుటుంబసభ్యులకు కొన్ని గ్రామాల్లో బిక్షాటన చేయాలని సూచించినట్లు పోలీసుల విచారణలో తేలింది.అలా వచ్చిన డబ్బులు, బియ్యంతో పండుగ చేయాలని తెలుపడంతో భిక్షమెత్తేందుకు తాను గన్నారం గ్రామానికి వచ్చినట్లు తెలిపింది. ఆమెకు పోలీసులు



నవీపేటలో అనుమానితుల వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై యాదగిరి

తహశీల్దార్ వెంకట్రావ్ ఎదుట బైండోవర్ చేస్తామన్నారు.

● మరో అనుమానిత వ్యక్తికి దేహశుద్ధి

మండలంలో గన్నారం గ్రామంలో గేదేల మంద వద్ద అనుమానితంగా సంచరిస్తున్న వ్యక్తిని గ్రామ యువకులు పట్టుకుని చితకబాదారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆయనను స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు బోధన్ గ్రామంఅని మతిస్థిమితం లేక రైలు నుంచి ఇందల్‌వాయిలో దిగి పంటపొలాల వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గ్రామస్తులు పట్టుకున్నట్లు తెలిపారు. గ్రామస్తులకు సరైన సమాధానాలు చెప్పక పోవడంతో చితకబాధి పోలీసులకు అప్పగించారు.

● పిల్లల కిడ్నాపర్‌లుగా అనుమానం

నవీపేట: మండలకేంద్రంలో శుక్రవారం సాయంత్రం పిల్లల కిడ్నాపర్‌లుగా అనుమానంతో ముగ్గురు వ్యక్తులను స్థానికులు చితకబాదారు. నవీపేటలో ప్రతి శుక్రవారం వారంత సంత కొనసాగుతుండగా సంతలో కూరగాయలు, ఇతర వస్తువులను కొనుగోలు చేయడానికి భరత్, అశోక్, జగదీష్ అనే ముగ్గురు ఇటుక బట్టి కార్మికులు సంతకు వచ్చారు. ఈ సమయంలో ముగ్గురు మద్యం తాగి ఉన్నారు. సంతలో నడిచి వెళ్లే సమయంలో ఒక మహిళ చేతికి వీరు తగిలారు. దీంతో ఆమె వీరిని చూసి పిల్లలను ఎత్తుకుపోయే వారిగా భావించి స్థానికులకు విషయం తెలిపింది. దీంతో అక్కడే ఉన్న పలువురు స్థానికులు ఈ ముగ్గురిని చేతులు, కర్రలతో చితకబాదారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ యాదగిరి గౌడ్ తమ సిబ్బందితో వెళ్లి ముగ్గురిని చికిత్స నిమిత్తం నవీపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంబంధిత వ్యక్తులు మహంతంలో ఇటుక బట్టిలో పని చేసే కార్మికులు అని వీరు ఆదిలాబాద్‌కు చెదిన వారని నెల రోజుల నుండి మహంతం ఇటుక బట్టిలో పని చేస్తున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. అనుమానస్పదంగా ఎవరైనా వ్యక్తులు సంచరిస్తే వారిపై దాడి చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు ధరిచేరవు

● జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నందిపేట, ఫిబ్రవరి 9: పల్లెల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దగ్గరికి రావని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. శుక్రవారం నందిపేట మండలంలోని బజార్‌కొత్తూర్, నందిపేట గ్రామాలలో నిర్మించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఆయన స్వయంగా మురికికాల్వలను శుభ్రం చేసి పిచ్చిమొక్కలను తొలగించి ట్రాక్టర్‌లో పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల వలే గ్రామాలను కూడా శుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఈ కార్యక్రమాలను చేస్తుందన్నారు. దీనికి అందరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్‌హుస్సెన్, నాయకులు నర్సాగౌడ్, గంగారెడ్డి, బాబురాజ్, మాజారుద్దిన్, అరుట్ల రమేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



బజార్‌కొత్తూర్‌లో చెత్తను ఎత్తి ట్రాక్టర్‌లో పోస్తున్న జడ్పీ చైర్మన్

రవీందర్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

● కాంగ్రెస్ రుద్రూరు మండల అధ్యక్షుడు

రుద్రూరు, ఫిబ్రవరి 9: మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఏనుగు రవీందర్‌రెడ్డిపై ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రుద్రూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. శుక్రవారం రుద్రూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్ మాట్లాడుతూ బాన్సువాడ పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్థాయి మరిచి రవీందర్‌రెడ్డిపై మరోకసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. ఇందులో మండల ఉపాధ్యక్షుడు నడిపింటి నగేష్, ఓబీసీ మండల అధ్యక్షుడు కర్కే అశోక్, కిసాన్ కేత్ మండల అధ్యక్షుడు అడప సాయిలు, రుద్రూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పార్వతి ప్రవీణ్, ఎంపీటీసీ గౌస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్ని: బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఏనుగు రవీందర్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సహించేది లేదని డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన ఇద్దరు కుమారులు నియోజకవర్గంలో దోపిడికి పాల్పడి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డం పెట్టుకుని వేలాది రూపాయల కుంభకోణానికి పాల్పడింది ఎమ్మెల్యే అనుచరులని ఆయన మండిపడ్డారు. రైతాంగం వద్ద ధాన్యం కొనుగోలు చేసి ఎంఎస్‌జీ ద్వారా కొనుగోలు చేసి కోట్లాది రూపాయలు స్వాహా చేసిన ఘనత ఎమ్మెల్యే పోచారంది కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పేద ప్రజలు ఇళ్లు నిర్మించుకుంటే వారి వద్ద నుండి మూడేసి బిల్లులు కాజేసిన ఘనత పోచారంకు చెందిందేనని ఆరోపించారు. తన ఇద్దరు కుమారులను వెనుకేసుకుని వచ్చి కోట్లాది రూపాయలు స్వాహా చేసి అవినీతి ఆరోపణలు కాంగ్రెస్‌పై నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇందులో కులకర్ణి సురేష్, గంగప్ప, ప్రసాద్, కూనిపూర్ రాజిరెడ్డి, రాంరెడ్డి, నారెడ్ల సాయిలు, బాలు ఉన్నారు.

పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యత

నందిపేట, ఫిబ్రవరి9: రాష్ట్రంలో పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు రాష్ట్ర ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అధికారి రంజిత్‌నాయక్ తెలిపారు. శుక్రవారం నందిపేట మండలంలోని ఉమ్మెడ శివారులో ఉన్న గోదావరి పరివాహక ప్రాంతాన్ని ఆయన జిల్లా ఫారెస్టు అధికారి వికాస్‌మీనతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మెడలో ఐదు ఎకరాలలో పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందులో బోటింగ్, రీసెర్చ్ సెంటర్‌లను ఏర్పాటు చేయడానికి త్వరలోనే హర్కిటెక్చర్ ప్రతిపాదనలు చేస్తారని తెలిపారు. అంతేగాకుండా పర్యాటకుల ఆకర్షణ కోసం వివిధ రకాల పనులను నిర్మిస్తామని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అధికారి రంజిత్‌నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్‌మీన, అధికారులు లక్ష్మణ్, శ్రీనివాస్, సుధాకర్, మాజీసర్పంచ్ రామడ పోశెట్టి, వీడీసీసభ్యులు, తదితరులు ఉన్నారు.

ఫారెస్ట్ అధికారుల స్థల పరిశీలన

డొంకేశ్వర్, ఫిబ్రవరి 9: ఈకో టూరిజం అభివృద్ధిలో భాగంగా ఫారెస్ట్ డెవలప్‌మెంట్ అటవీ అధికారులు శుక్రవారం నడ్కుడ, గాదేపల్లి గ్రామశివారులో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల్లో ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించారు. బోటింగ్, రిసార్ట్ ఏర్పాటుచేస్తామని ఎస్సారెస్పీ ట్యాంక్‌కు ఏటువంటి ఇబ్బందులు ఉండవదని సూచించారు. ఈకో టూరిజాం ఏర్పడడం వల్ల స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డీఎఫ్ రంజిత్‌నాక్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్‌మీనా, అటవీ క్షేత్రదికారులు శ్రీనివాస్, లక్ష్మణ్, ఉప కక్షేత్రాధికారి సుధాకర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

‘లబ్ధిధారుల జాబితా సిద్ధం చేయాలి’

ఏర్గట్ల, ఫిబ్రవరి 9: మహాలక్ష్మీ గ్యాస్ పథకం లబ్ధిదారుల జబితా సిద్ధం చేయాలని ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులకు పరిశీలించిన అనంతరం ప్రజాపాలన దరఖాస్తులో మహాలక్ష్మీ పథకానికి సంబంధించిన గ్యాస్ పథకంలో భాగంగా మండలంలో 2274 మందికి సంబంధించిన గ్యాస్ కనెక్షన్ వివరాలు తప్పులు గుర్తించామని వాటిని గ్రామ స్థాయిలో రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో సవరణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాసుఫ్, ఎంపివో శివచరణ్, ఆర్ఐ సధానంద్, జీపి కార్యదర్శి జాకీర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ హామీ సర్వే

రుద్రూరు, ఫిబ్రవరి 9: రుద్రూరు మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేలో వినియోగిస్తున్న విద్యుత్ వివరాలను సేకరిస్తూ ఇంటి యజమాని సంబంధించిన రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను సేకరిస్తున్నారు. దీంతో ఉచిత విద్యుత్ వినియోగానికి అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. ఈ ఇంటింటి సర్వేలో విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటి పథకంలో భాగంగా శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలలో రూ.500 గ్యాస్ సిలిండర్ గృహజ్యోతి పథకాల దరఖాస్తులను అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు పరిశీలించారు. శుక్రవారం తొర్లికొండ గ్రామంలో గ్యాస్ సిలిండర్‌పై వచ్చిన దరఖాస్తులను ఇంటింటికి వెళ్ళి ఎంపీడీవో బ్రహ్మానందం పరిశీలించారు. ప్రజలు ఈ పథకాల కోసం సర్వే చేయడానికి వచ్చిన అధికారులకు సహకరించాలని కోరారు.

గంగస్నానికి వెళ్లి ఒకరి మృతి

డొంకేశ్వర్, ఫిబ్రవరి 9: మండలంలోని నికల్‌పూర్ గ్రామానికి చెందిన సాద బోజన్న(38) అనే వ్యక్తి గంగాస్నానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం గ్రామదేవతలకు జలాభిషేకానికి గంగజలాలను తీసుకురావడానికి వెళ్ళిన భోజన్న గంగనదికి వెళ్లారు. గంగనదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా సంఘటన వద్దకు చేరుకున్న కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా రోదించారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై రాహుల్ తెలిపారు.

కమ్మర్‌పల్లిలో ఉరివేసుకుని ఒకరు..

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 9: కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందిన చిరునాంజి(వడ్ల) బాలకిషన్ (54) అనేవ్యక్తి శుక్రవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గత కొంత కాలంగా పక్షవాంతో బాదపడుతున్న బాలకిషన్ తగు చికిత్సలు పొందుతున్నా ఫలితం లేక పోగా కాళ్లు, చేతులు సహకరించకపోవడంతో మానసికంగా కుంగిపోయి జీవితంపై విరక్తి చేంది శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో నైలాన్ తాడుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించినట్లు ఎస్సై తెలిపారు. భార్య ధనలక్ష్మీ పిర్యాదుమెరకు శవపంచినామజరిపించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసునమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

కోటగిరి, ఫిబ్రవరి 9: పొతంగల్ మండలంలోని చేతన్ నగర్ గ్రామానికి చెందిన అమ్రాపాలి(28)అనే వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. అమ్రాపాలి గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుంది. గురువారం రాత్రి కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందగా మృతురాలి తల్లి దైవశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మైలారంలో ఒకరి ఆత్మహత్య

ధర్పల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని మైలారం గ్రామంలో అల్లూరి పెద్ద గంగారం(62)అనే వ్యక్తి శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వంశీకృష్ణరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన గంగారం మద్యానికి బానిసై ఈనెల 8న మద్యం సేవించి కుటుంబసభ్యులతో గొడవకు దిగాడు. శుక్రవారం ఉదయం ఇంటిలోని గది తెరువగా ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులకు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

ముప్కాల్, ఫిబ్రవరి9: ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ భూమిలో కరగడానికి కొన్నళ్లు పడుతుందని, దీని వల్ల పర్యవరణ కాలుష్యం ఏర్పడుతుందని ముప్కాల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వస్తువుల నిషేదంపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఇందులో ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ వనజరాణి, నాయకులు నర్సారెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, మునీరోద్దీన్, లయన్స్ క్లబ్ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

టీయూలో హాస్టల్ విద్యార్థుల అస్వస్థత

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 9: తెలంగాణ యూనివర్సిటీ బాలికల వసతి గృహంలో శుక్రవారం ముగ్గురు విద్యార్థిని అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థినులు అల్పాహారం తినగా కళ్లు తిరిగి ఫిట్స్ రావడంతో పడిపోయారు. వెంటనే గమనించిన హాస్టల్ కేర్‌మేకర్ అస్వస్థతకు గురైన ఎంబీఏ విద్యార్థినినులు పల్లవి, అశ్విని, అర్చిణి వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. విశ్వవిద్యాలయంలో ఆసుపత్రి ఉన్న వైద్యసిబ్బంది లేకపోవడంతో తరచు ఈ ఘటనలు జరుగుతున్నాయని ఇటీవంటి ఘనటలు జరగడానికి అధికారుల వైఫల్యమే కారణమని యూనివర్సిటీ విద్యార్థినిలతో చెలగాటం ఆడుతున్నారని ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం మండిపడ్డారు. అధికారులు వెంటనే హాస్టల్‌లో మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో విద్యార్థినిలకు వైద్యసిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, రాజేందర్, సాగర్, ప్రశాంత్, శివ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని చందమియాబాగ్‌తాండా వద్ద 44వ జాతీయరహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పడకల్ గ్రామానికి చెందిన రఘు, అతని తండ్రికి గాయాలైనట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పడకల్ గ్రామానికి చెందిన రఘు, తండ్రి బైక్‌పై డిచ్‌పల్లి నుంచి స్వగ్రామానికి వస్తుండగా చందమియాబాగ్‌తాండా వద్ద మూల మలుపు వద్ద డిచ్‌పల్లి నుంచి వస్తున్న హర్యానకు చెందిన ట్రక్కు వాహనం అదుపుతప్పి బైక్‌ను కొట్టింది. ఈ ప్రమాదంలో రఘు, తన తండ్రికి గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మొబైల్‌షాప్‌లో భారీ అగ్నిప్రమాదం

ఖిల్లా, ఫిబ్రవరి 9: నగరంలోని ఆర్‌పీ రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలోని మొబైల్‌షాప్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో షాపులోని కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, ల్యాప్‌టాప్‌లతో పాటు వివిధ రకాల సెల్‌ఫోన్లు అగ్నికి ఆహుతయ్యాయి. హైటెక్ మొబైల్ షాప్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు రూ.లక్ష విలువ గల ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదం షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖాధికారులు తెలిపారు. గురువారం రాత్రి ప్రతిరోజులాగే షాపును మూసివేసి వెళ్లానని యజమాని ముఖీమ్ తెలిపారు. ఉదయం షాపు నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక శాఖాధికారులు నర్సింగ్ రావుతన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. మంటలు పక్క దుకాణాలకు వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

టిప్పర్ యజమానికి జరిమానా

నవీపేట, ఫిబ్రవరి 9: మండలంలోని ఫకీరాబాద్ సమీపంలో గురువారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకోగా సంబంధిత టిప్పర్ యాజమానికి శుక్రవారం 10వేల రూపాయల జరిమాన విధించడం జరిగిందని తహసీల్దార్ ధన్‌వాల్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి

‘తప్పుడు ప్రచారాలను మానుకోవాలి’

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మెరకు ఒక్కోపతకం అములు చేస్తూ పోతుంటే పథకాలు రాష్ట్రంలో పథకాలు అమలు కావడం లేదని అనడం అసత్య ప్రచారమని బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను అయోమయానికి గురి చేసేవిధంగా చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు హితవుపలికారు. మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట్ రవి అధ్యక్షతన జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే కళ్యానలక్ష్మీ, ఆసరా, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ లాంటి పథకాలు నిలిచిపోతాయని తప్పుడు ప్రచారం చేశారని శుక్రవారం మండలకేంద్రంలో కల్యా ణలక్ష్మీ చెక్కుల పంపిణీ ప్రత్యేక నిదర్శనమన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, సల్లూరి గణేష్ గౌడ్, సుంకెట శ్రీనివాస్, సింగిరెడ్డి శేఖర్, ప్రదీప్, జగదీశ్ అవారి శ్రీనివాస్, తదతరులున్నారు.

‘బాలకార్మికులు ఉంటే చర్యలు’

ముప్కాల్, ఫిబ్రవరి 9: బాల్కొండ ఇటుక బట్టిల దగ్గర బాల కార్మికులను పెట్టుకుంటే చర్యలు తప్పవని సై గోపి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఇత్వార్‌పేట్, బుస్సాపూర్ గ్రామాలలోని ఇటుక బట్టిలను ఆయన తనిఖీ చేశారు. ఇటుక బట్టిల వద్ద బాల కార్మికులు లేకుండా చూడాలని, చట్టవిరుద్ధంగా బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు అనుగుణంగా బట్టిలు నిర్వహించాలని ఆయన వివరించారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత

ముప్కాల్, ఫిబ్రవరి 9: బాల్కొండ గ్రామానికి చెందిన షేక్ సలీం అనే వ్యక్తి మొబైల్ ఫోన్‌ను ఈనెల 14న వన్నెల్(బి)చౌరస్తాలో పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ సిస్టం ద్వారా శుక్రవారం ఎస్సై గోపి బాధితుడికి ఫోన్‌ను అందజేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మోపాల్, ఫిబ్రవరి 9: మండలంలోని కులాస్‌పూర్-కంజర గ్రామాల సరిహద్దులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాష్ తెలిపారు. శుక్రవారం కంజర గ్రామ పరిదిలో డీసీఎం వాహనంలో 18 క్వింటాళ్ళ, కులాస్‌పూర్ గ్రామ పరిదిలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేయగా.. అవి రేషన్ బియ్యంగా పోలీసులు తేల్చారు. దీంతో సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు. అలాగే మోపాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

నాగమడుగులో భక్తుల పుణ్య స్నానాలు

నిజాంసాగర్, ఫిబ్రవరి 9: మండలంలోని అచ్చంపేట శివారులోని మంజీరా పరివాహక ప్రాంతంలో గల నాగమడుగు వద్ద మాఘ అమా వాస్య సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు చేస్తారు. అలాగే ఈ యేడు కూడా శుక్రవారం మాఘ అమావాస్యను పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు పుణ్య స్నానాలు చేశారు. జిల్లాతో పాటు సంగారెడ్డి, మెదక్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోసం అచ్చంపేట గ్రామస్థులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాగమడుగు వద్ద బండరాళపై పాము ఆకారంలో గత ఎన్నో ఏళ్ల నుంచి ఆన వాళ్లు ఉన్నాయని, ప్రత్యేక రోజుల్లో భక్తులు మంజీరా నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తారని భక్తులు తెలిపారు.


సలాబాత్‌పూర్ ఆలయంలో పూజలు చేస్తున్న నాందేడ్ ఎంపీ చిక్లీకర్

సలాబాత్‌పూర్ ఆలయంలో నాందేడ్ ఎంపీ పూజలు

మద్నూర్: మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో నాందేడ్ ఎంపీ చిక్లీకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మాఘ అమావాస్య పురస్కరించుకుని తమ కుటుంబ సభ్యులతో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తెల్లవారు జాము నుంచే వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీకి ఆలయ మర్యాదలతో సన్మానించారు. ఆయనతో పాటు గోజేగావ్‌ఖర్ పటేల్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని గుండ్ల చెరువు సమీపంలో గల కటికం మల్లేశుని ఆలయంలో భక్తులు పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో పెద్ద ఎత్తున జాతర కొనసాగింది.

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలోని దేవేంద్రుడి గుట్టపై జాతరను నిర్వహించారు. పెద్దమల్లారెడ్డి గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాలు, మెదక్ జిల్లా నుంచి భక్తులు పెద్దఎత్తున చేరుకుని ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి సిద్దిపేట జిల్లా కూడవెల్లి రామలింగేశ్వర జాతరకు ప్రత్యేకవాహనాల్లో పెద్దఎత్తున తరలివెళ్లారు.

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలోని వీర హనుమాన్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయ ప్రాంగణంలో చౌరస్తా అన్నారం గ్రామాలకు కలిపే రోడ్డుపై నిర్వహించిన జాతరలో భక్తులు పూజలు పాల్గొని తినుబండారాలను వివిధ వస్తువులను కొనుగోలు చేశారు.


నాగమడుగులో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

లింగంపేట: మండలంలోని ప్రజలు పెద్దవాగు పక్కనే ఉన్న చారిత్రక మల్లిఖార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మాడం రవి అన్నదానం చేశారు. ఐలాపూర్‌లో పాముల వాగు వద్ద జగం రాజ్‌కుమార్ అన్నదానం చేశారు.

రామారెడ్డి: మద్దికుంటలో బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలో ఉన్న కోనేరు, బావుల వద్ద స్నానాలు, వ్రతాలు పూజలు నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

బీబీపేట: యాడారం గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దుబ్బాక మండలంలోని కుడెల్లిలో జరిగే రామలింగేశ్వరస్వామి జాతరకు పోటెత్తారు. భక్తులు ఉదయం నుంచే కుడెల్లి వాగులో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల
సమాచారం ఇవ్వాలంటూ వినతి పత్రం

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 9: బాన్సువాడ పట్టణ, మండల స్థాయిలో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సమాచారం అందజేయాలంటూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మాసాని శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులతో పాటు సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలను అందజేయాలని తహసీల్దార్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్ల రాఘవేందర్, శ్రీనివాస్, తృప్తి నాగరాజు, హన్మాండ్లు, వెంకట్‌రెడ్డి, అక్బర్, ఈశ్వర్ తదితరులున్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం

ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు పూర్తి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 9: కామారెడ్డి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు పూర్తయినట్లు ఎన్నికల కమిటీ కన్వీనర్ గౌరి శంకర్, కో కన్వీనర్ రవీందర్‌లు తెలిపారు. శుక్రవారం నామినేషన్‌ల ఉప సంహరణ తర్వాత అన్ని పదవులకు ఒక్కొక్క నామినేషన్‌లు రావడంతో కామారెడ్డి అధ్యక్షుడిగా కంచర్ల లింగం, కార్యదర్శిగా సుకుమార్‌గౌడ్, కోశాధికారిగా నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. దీంతో ఈనెల 11న నిర్వహించాల్సిన ఎన్నిక ప్రక్రియ ముగిసినట్లేనని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు గజవాడ రవి, కైలాస్ సంతోష్, రమేష్, తులసీదాస్, మోహన్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని లారీ బోల్తా : డ్రైవర్ మృతి


మృతి చెందిన అనిల్‌కుమార్

భిక్కనూరు, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు లారీ చెట్టుకు ఢీకొనడంతో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని పాలు కాపూర గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ బిందు(38) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కంటైనర్ లారీలో సీసీ కెమెరాల లోడ్‌తో నోయిడా వెళ్తుండగా భిక్కనూరు మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్టును ప్రమాదవశాత్తు ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనిల్‌కుమార్ స్టీరింగ్‌లో ఇరుక్కుపోయి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి బావ అమన్‌బిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు ఎల్లారెడ్డిలో రోడ్డు భద్రత మాసోత్సవాలు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 9: ఎల్లారెడ్డిలోని ముత్యపు రాఘవులు, పెంటయ్య ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉదయం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, రక్తదాన శిబిరం ఉన్నాయని ఎల్లారెడ్డి ఎస్‌ఐ బొజ్జ మహేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహనతో పాటు రక్తదాన శిబిరం కూడా ఉంటుందన్నారు.

వికలాంగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

● జడ్పీ చైర్‌పర్సన్ దఫేధర్ శోభ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 9: వికలాంగులు సదరం సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని కేటగిరి వారిగా మీసేవలో స్లాట్ నమోదుచేసే విధంగా తేదిలు ఇవ్వాలని జడ్పీచైర్‌పర్సన్ దఫేదర్‌శోభ అధికారులకు సూచించారు. శనివారం స్థాయిసంఘ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాధారణ వ్యక్తి వికలాంగులను వివాహం చేసుకున్నట్లయితే వివాహ ప్రోత్సహక పథకంలో భాగంగా జిల్లాలో రూ.9లక్షలు ప్రోత్సహం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఎస్‌సీ కార్పోరేషన్ ద్వారా పీఎం అజయ్ పథకం కింద 28 యూనిట్లకు గాను 53 లక్షల విలువతో మోటార్లు, విద్యుత్ సౌకర్యంతో సహా మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అంబేద్కర విదేశీ విద్యనిధి పథకం కింద రూ.29లక్షల 42 వేలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.కేజీ టూ పీజీ పథకం ద్వారా విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చిన విషయం తెలిసిందేనని గురుకుల విద్యాలయాల ద్వారా నిరుపేద గిరిజన,బీసీ,ఎస్‌సీ విద్యార్థులకు ఉచితంగా కార్పోరేట్ స్థాయి విద్యను అందించేందుకు ముందుకు వచ్చి విద్యవ్యవస్థలో విప్లవం తీసుకువచ్చిందని తెలిపారు. గొర్రెల పంపిణీలో భాగంగా మొదటి విడుతలో 17018 కింద 10796 పంపిణీ అయ్యాయని, రెండో విడుత కింద 2023-24 సంవత్సరం కింద 582 యూనిట్లు పంపిణీ అయ్యాయని తెలిపారు.డీడీలు చెల్లించిన వారికి గొర్రెల పంపిణీచేయాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో సాయాగౌడ్, భాగ్యలక్ష్మీ, జడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శోభ

రేషన్ దుకాణం ఏర్పాటు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 9: మండలంలోని సాతెల్లి గ్రామస్థులకు రేషన్ షాప్ అందుబాటులో లేకపోవడంతో పక్క గ్రామమైన జంగమయ్యపల్లి ఎల్లారెడ్డికి వచ్చి రేషన్ సరుకులు తీసుకోవడం ఇబ్బంది అవుతుందని స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు వారి సమస్య తెలపడంతో స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సాతెల్లి గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామస్థులకు ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న సమస్యను తీర్చిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పట్ల ఆనంద వ్యక్తం చేశారు.

పీవీకి భారతరత్న ప్రకటించడం హర్షనీయం

బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 9: భారతమాజీ ప్రధాని, బ్రాహ్మణ బిడ్డ, తెలంగాణకు చెందిన పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షనీయమని బాన్సువాడ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కులకర్ణి చంద్రకాంత్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీవీ నరసింహారావు భారత ప్రధానిగా ఉన్నపుడు భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రత్యేకమైన ఆర్థిక సంస్కరణలతో అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప రాజకీయవేత్త అని గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న బిరుదును ప్రకటించడం బాన్సువాడ బ్రాహ్మణ సంఘం తరపున ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

నసూరుల్లాబాద్, ఫిబ్రవరి 9: మండలంలోని దుర్కి గ్రామంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సమాచారం తెలుసుకున్న నసురుల్లాబాద్ ఎస్సై లావణ్య సంఘటన స్థలానికి చేరుకొని మృతద్దేహాన్ని పరిశీలించాగా, ఆధార్‌కార్డు ఉండడంతో ఆధార్ కార్డుపై దాసరి పీరవ్వ అడ్రస్ జుక్కల్ అని ఉండడంతో మృతురాలికి ఎవరు కూడా బంధువులు లేరని తెలియడంతో మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎవరికైనా ఏమైనా వివరాలు సమాచారం తెలిస్తే 8712686174 నంబర్‌కు తెలియజేయాలని ఎస్‌ఐ లావణ్య తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

భిక్కనూరు, ఫిబ్రవరి 9: మండలంలోని పెద్దమల్లారెడ్డి ఎక్స్‌రోడ్డులో ఉన్న హనుమాన్ ఆలయ సమీపంలో గురువారం రాత్రి ఒకరి ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మధ్య ప్రదేశ్‌కు చెందిన సర్దార్ దామ్మో తన స్నేహితులతో గత కొంతకాలంగా పెద్దమల్లారెడ్డి ఎక్స్‌రోడ్డు వద్ద గల షెటర్‌లో ఉంటూ కుర్చీలను విక్రయిస్తున్నారు. ఎప్పటీలాగే గురువారం రాత్రి షెట్టర్ ముందు బైక్‌ను పార్క్‌చేసి నిద్రపోయాడు, శుక్రవారం తెల్లవారుజామున చూసేసరికి బైక్ కన్పించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఉద్యోగుల వేతనాలు ఇప్పించాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 9: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ శానిటేషన్ ఉద్యోగులకు గత ఆరు నెలల నుంచి వేతనాలు రావడం లేదని శుక్రవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతుందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వేతనాలు అందే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నవీన్ కుమార్, శ్రీనివాస్, సాయిలు, దేవయ్య వెంకట్ రాములు, శోభ మంజుల, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ వేధిస్తోంది

● ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని బెదిరిస్తోంది

● పీఈటీ వీణ వాట్సప్ స్టేటస్‌తో కలకలం

దోమకొండ, ఫిబ్రవరి 9: మండలంలోని సీతారాంపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పీఈటీ వీణ తన సెల్‌ఫోన్‌లోని స్టేటస్‌లో పెట్టిన విషయం మండలంలో శుక్రవారం కలకలం లేపింది. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న వీణ పట్ల ప్రిన్సిపాల్ కక్షకట్టి తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులను మాట్లాడకుండా చేస్తుండడంతో తాను డిప్రెషన్‌లోకి వెళ్లినట్లు వీణ తెలిపింది. పిల్లలకు సరిగా కూరలు వడ్డించడం లేదని అడిగినందుకు తనను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆమె ఆరోపించారు. కాగా నాకేమైన జరిగితే ఎస్‌వో మేడం బాధ్యత వహించాలని పీఈటీ వీణ పెట్టిన వాట్సప్ స్టేటస్‌తో మండలంలో కలకలం రేపింది. డీసీడీవో ఉమారాణి మేడంకి కూడా చెప్పినా పట్టించుకోవడం లేదు. తిరిగి తననే ట్రాన్స్‌ఫర్ పెట్టుకోమని అంటున్నారని తప్పుచేయని నేను ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలని వీణ తెలిపారు. ఈ మేరకు పీఈటీ వీణను విధులను సక్రమంగా నిర్వహించాలని చెప్పానే తప్ప తనను ఇబ్బందులకు గురి చేయలేదని ప్రిన్సిపాల్ మమత తెలిపారు.

రామారెడ్డి ఘటనపై విచారణ ముమ్మరం

ఘటనపై ఎస్పీ సీరియస్

విచారణ అధికారిగా కామారెడ్డి డీఎస్పీ

దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు

మాచారెడ్డి, ఫిబ్రవరి 9: రామారెడ్డి మండలంలో ఓ జంటను వివస్త్రను చేసి పాశవికంగా దాడిచేయడం ఆ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడంపై జిల్లా ఎస్పీ సింధూశర్మ సీరియస్ అయ్యారు. స్పందించిన ఎస్పీ ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని పోలీసులకు ఆదేశించారు. విచారణ అధికారిగా కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్‌ను నియమించారు. అయితే డీఎస్పీ బాధితులను తన కార్యాలయానికి పిలిపించుకుని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. దాడికి పాల్పడిన నాగరపు ఎల్లయ్య, భాగ్యలక్ష్మీ, నాగారపు సంధ్య, పుట్ట నర్సింలు, మిల్లర్ రవిపై అట్రాసిటి కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చి కస్టడీలోకి తీసుకున్నారు. వీరి వెనుక ఎవరెవరు ఉన్నారో విచారణ చేపడుతున్నారు.

వివస్త్రను చేసిన వారిని కఠినంగా శిక్షించాలి..

రామారెడ్డి మండలంలో దళిత మహిళను వివస్త్రను చేసి సభ్యసమాజం తలదించుకునేలా సంఘటన ఉందని ఆ సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని శుక్రవారం మాచారెడ్డి చౌరస్తాలో విలేకరుల సమావేశం నిర్వహించి డిమాండ్ చేశారు. కారంపొడి చల్లుతూ దాడికి పాల్పడి చితకబాదిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. భవిష్యత్తులో మహిళలపై ఇలాంటివి జరగకుండా చట్టరీత్యా చర్యలు తీసుకుని బాధితులకు సరైన న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఒకవేళ బాధితులకు న్యాయం జరగకపోతే దళితసంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేయడానికి వెనకడబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి మండల దళితసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 9: దళిత యువతిని వివస్త్రను చేసి మానవత్వాన్ని మరిచి అమానవీయంగా ప్రవర్తించిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత ప్రజా, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం కామారెడ్డి పట్టణ కేంద్రంలో దళితసంఘాలు బాధితులను, పోలీసులను కలిసి సంఘటన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి విఠల్, బామ్‌సెఫ్ జిల్లా అధ్యక్షుడు సాయిగౌతమ్‌లు మాట్లాడుతూ రామారెడ్డి మండలంలో దళిత యువతిపై దాడి చేయడమే కాకుండా ఆమెను వివస్త్రను చేసి వీడియోలు తీసీ శిక్షిడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బాధితులు మాచారెడ్డి పోలీసుస్టేషన్‌కు వెళితే జీరో ఎఫ్ఐఆర్ చేయకుండా మా పరిధిలోకిరాదని చెప్పడం తగదన్నారు. తర్వాత రామారెడ్డి పోలీసు స్టేషన్‌కు వెళ్లె కేసు నమోదుచేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి బాధితులు తీసుకెళ్లగా ఎట్టకేలకు కేసు నమోదు చేశారని నిందితులపై అట్రాసిటి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కొంతమంది నిందితులను తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారని అనుమానం వస్తుందని అందరిని అరెస్ట్ చేయాలన్నారు.

నియామకం

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 9: జాతీయ బీసీ యువజన సంఘం కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జీగా కర్రె గడ్డం భాస్కర్‌గౌడ్‌ను, నసురుల్లాబాద్ మండల ప్రధాన కార్యదర్శిగా కాలగడ్డ సాయిని నియమించినట్లు తెలిపారు. బీసీల సామాజిక ఎదుగుదలకు యువకుల పాత్ర ముఖ్యమైందని, ప్రతీ యువకుడు సమాజంలో 56 శాతం ఉన్న బీసీలకు మనమెంతో మనకంత వాటా ప్రకారం రిజర్వేషన్ కోసం పోరాటం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం జనగణను చేసి బీసీలకు చట్టసభల్లో, ఉద్యోగాలలో 56 శాతం రిజర్వేషన్ ప్రకటించి బీసీలపై చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ యువజన నాయకులు అఖిల్‌రావు, ప్రవీణ్, మనోజ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

బీర్కూర్, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉపా ధ్యాయులు ఘనంగా నిర్వహించారు. పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా సుమారు 5వేల విలువ గల నేమ్ ప్లేట్‌లను ప్రతీ పాఠశాలకు అందించారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు సంతోష్ జెట్టి, నాగరాజు, విఠల్ యాదవ్, రామకృష్ణ, హమీద్, దుర్గప్రసాద్, హాజీ, అమృత, రాధాకృష్ణ, వేణుగోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: కృష్ణానది జలాలలో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 13న నల్గొండ జిల్లాలో భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పార్టీ సమన్వయ కర్త ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ పరిశీలించారు. ఆయనతో పాటు నల్గొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, క్రాంతి కిరణ్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- ఈగల్, లాల్ సలాం
ప్రియా 35	- యాత్ర-2

బాన్సువాడ

మహేశ్వరి	- ఈగల్
వెంకటేశ్వర	- హనుమాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

